
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 28-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 551 పేజీలు: 4 వెల: రూ.7




## ఇచ్ఛాపురంలో..
# మ్యారేజ్ మాఫియా!

* ఊరుకో మ్యారేజ్ బ్రోకర్
* ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్న వధువులు
* లాడ్జీల్లోనే వారికి బస, సకల సదుపాయాలు
* కన్యాశుల్కం ఇచ్చి మరీ వివాహాలు
* ఒక పెళ్లి చేస్తే రూ.35వేలు నుండి లక్ష రూపాయల వరకు కమీషన్
* అన్నీ కుదిరితే ఆలయాలు, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెళ్లి
* గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా
* ఇదో టైపు మహిళల అక్రమ రవాణా



**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 27 (వార్త):** యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత: ఎక్కడ దేవతలు పూజించబడతారో అక్కడ స్త్రీలు ఉద్భవించబడతారు.. అని పురాణాల్లో, ఇతిహాసాలలోని శ్లోకం అర్థం. గతంలో ఆడపిల్ల పుడితేనే పాపం, శాపం అనుకొని పురిట్లోనే చిదిమేసేవారు. దీని పర్యవసానం.. ఇప్పుడు ఆడపిల్లల కొరత వెంటాడుతోంది. ఇచ్ఛాపురంలో 19 ఏళ్లు కూడా నిండని ఓ బాలిక మైనార్టీ తీరక ముందే 8 పిల్లలు చేసుకుంది అంటే అది ఆ బాలిక తప్పు.. అనేకంటే అలా పెళ్లిళ్లు చేసిన బ్రోకర్లది కూడా. ఒక పెళ్లి జరగడానికి కనీసం మూడు నెలల సమయం తీసుకున్నా 8 పెళ్లిళ్లు అంటే రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. ఆమె అన్ని పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుక నుంచి చాలామంది ఉన్నారు.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇదంతా మ్యారేజ్ మాఫియా ముసుగులో జరుగుతుంది. పెళ్లిళ్లు చేసే ఒక్కో బ్రోకర్‌కు రూ.35 వేలు నుండి లక్ష రూపాయల వరకు ఈ మాఫియా కమీషన్ ఇస్తోంది. ఆడపిల్లకు ఎదురు కట్నం పాత పద్ధతిలో చెప్పాలంటే.. కన్యాశుల్కం ఇచ్చి మరి కొందరు పెళ్లి చేసుకుంటున్నారు. దీని వెనక ఏం తతంగం ఉందో తెలియదు గానీ ఇప్పటివరకు ఒక్క ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోనే 300కు పైగా పెళ్లిళ్లు జరిగాయి. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీల్లో కలిపి వెయ్యికి పైగా పెళ్లిళ్లు జరిగి ఉండే అవకాశం ఉంది. ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో సుమారు రెండు వేల మంది వరకు ఆడపిల్లలను గడప దాటించి ఉంటారు. నెల్లూరు, గూడూరు, చిత్తూరు, ప్రకాశం, కడప, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి ఆడ పిల్లల కోసం ఈ ప్రాంతాలకు ఎగబడి వస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉండే అవివాహితులు, సింగిల్ ఉమెన్‌లు, 40 ఏళ్ళు పైబడి పెళ్లి కాని వారు, వితంతువుల కోసం వెదుకుతున్నారు. దొరికితే చాలు కన్యాశుల్కం ఇచ్చి పెళ్లి చేసుకుని తీసుకుపోతున్నారు. ఒకరకంగా ఇది మహిళల అక్రమ రవాణా అని చెప్పాలి. గత కొన్నాళ్ల నుంచి ఈ తతంగం ఈ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. బొడ్డకాలి, తేలుకుంచి, బెల్లిపడా, గొల్లవీది తదితర ప్రాంతాల నుండి సుమారు 30కి మందికి పైగా బ్రోకర్లు ఉన్నారు. వీరంతా ఉదయాన్నే కాశీ విశ్వనాథ్ గుడి జంక్షన్ వద్ద లేదా దాసన్నపేట జంక్షన్ వద్ద ఎదురు చూస్తుంటారు. తెల్ల పంచలు తెల్లబట్టలతో వేరే ప్రాంతాల నుండి కొందరు ట్రైన్ల ద్వారా, సొంత వాహనాల్లో ఈ ప్రాంతానికి వస్తారు. వీరి కోసం ఇక్కడ బ్రోకర్లు లాడ్జిల్లో రూములు బుక్ చేసి ఉంచుతారు. వీరి కోసమే కొత్తగా రెండు నుండి మూడు డార్మెట్రీలు కూడా ఇచ్ఛాపురం ప్రాంతంలో వెలిశాయి. ఉదయం టిఫిన్ దగ్గర నుండి రాత్రి భోజనం వరకు అన్నింటినీ బ్రోకరే సదుపాయాలు కల్పిస్తారు. బ్రోకర్లు చూపించిన సంబంధాలు చూసి అన్నీ కుదిరితే స్థానికంగానే గుడిలో పెళ్లి చేసేస్తారు. 18 ఏళ్ళు దాటి ఉంటే సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్టర్ మ్యారేజ్ చేస్తారు. ఆధార్ కార్డులతో సహా అన్నీ సిద్ధంగా ఉంచుకుంటారు. ఒకవేళ వేరే ప్రాంతంలో పెళ్లి చేయాల్సి వస్తే ఇక్కడి నుండి ఆడపిల్ల తరఫున బయలుదేరి వెళ్లేందుకు 10 మంది రెడీమేడ్ పెద్దలు సిద్ధంగా ఉంటారు. వీరికి అప్ అండ్ డౌన్ టికెట్లు, అక్కడికి వసతి సౌకర్యం, భోజనం, తదితర అన్ని సదుపాయాలు సమకూరుస్తారు. మొత్తం మీద ఈ పెళ్లిళ్ల వ్యవహారం పెద్ద మాఫియాగా సాగుతుంది. దీనిపై సమగ్ర విచారణ చేయకపోతే భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

### వివాహిత ఆత్మహత్య



**సోంపేట, డిసెంబర్ 27 (వార్త):** సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో కేవలం నాలుగు నెలల క్రితమే పెళ్లయిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు, గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తామాడ అను (24)రే నాలుగు నెలల క్రితం జింకుభద్ర గ్రామానికి చెందిన తామాడ సాయి అనే యువకునితో వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య ఎటువంటి విభేదాలు లేవు. కొద్ది రోజుల క్రితం ఇద్దరు కలిసి తిరుపతితో పాటు ఇతర పుణ్యక్షేత్రాలు సందర్శించి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. ఇంతలో ఆమెకు ఏమైందో కానీ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి మామిడిపల్లి గ్రామానికి చెందిన గేదెల జ్యోతి.. అల్లుడుపై అనుమానంతో సోంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లుడు సాయికి అక్రమ సంబంధం ఉందని ఈ విషయం కుమార్తె అనుకు తెలిసి తట్టుకోలేక ఇలా ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదు చేయడం గమనార్హం. దీనిపై సోంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓపికగా వింటూ...

* ప్రజా దర్బార్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * సుమారు 500కుపైగా వినతుల స్వీకరణ
* మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం తొమ్మిది వరకూ సాగిన దర్బార్

# బాధితులకు భరోసా అందిస్తూ..!

**శ్రీకాకుళం, డిసెంబర్27 (వార్త):** కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం శ్రీకాకుళంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 9గంటల వరకూ సాగింది. ఇచ్ఛాపురం మొదలుకుని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు తమ సమస్యలను చెప్పుకున్నారు. ఉపాధి, ఫించన్లు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వినతులు వెల్లువగా తరలివచ్చాయి. సుమారు 500 పైగా వినతులు రాగా.. ఓపికగా ప్రతీ వినతినీ అందుకున్న రామ్మోహన్ నాయుడు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. వికలాంగులు, మహిళలు, వృద్ధులకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రామ్మోహన్ నాయుడు నిర్వహించారు.

**భవనాల నిర్మాణానికి సహకరించండి**

ఎచ్చెర్లలోని ఒకటవ బెటాలియన్ కమాండెంట్ సి.హెచ్.వి.ఎస్. పద్మనాభ రాజు శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎచ్చెర్ల ఒకటవ బెటాలియన్‌కు భవనాల నిర్మాణం అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఒకటవ బెటాలియన్‌లో విధులకు మరో తొమ్మిది మాసాలలో 600 మందికి పైగా కానిస్టేబుళ్ళు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో భవనాల ఆవశ్యకతపై దృష్టి సారించి ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌పై ఒత్తిడి పెంచి నిధులు త్వరితగతిన మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి నిర్మాణం కోసం సహకారం అందించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, శివకుమార్, పోలీస్ హౌసింగ్ ఏఈ తరుణ్ ఉన్నారు.




## ఇది కదా.. మానవత్వం అంటే!

* వీధి కుక్కపిల్లకు గాయం
* శస్త్రచికిత్స చేయించిన అంజనీకుమార్



**ఇచ్ఛాపురం, డిసెంబరు 27(వార్త):** ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపార వేత్త కేశవపట్నం అంజనీకుమార్(అంజిబాబు) శుక్రవారం తన దుకాణం వద్ద ఉన్నాడు. అక్కడే వీధి కుక్కలు గొడవ పడ్డాయి. దీంతో ఓ కుక్క పిల్ల తీవ్రంగా గాయపడింది. దాని కనుగుడ్డు బయటకు వచ్చేసింది. కుక్క పిల్ల దీన స్థితిని చూసి చలించిపోయిన అంజనీకుమార్ తన సొంత కారులో దానిని తీసుకుని బరంపురంలోని వెటర్నరీ వైద్యుడి వద్దకు తీసుకుని వెళ్లారు. కుక్కపిల్లకు ఆరేడు ఇంజెక్షన్లు ఇచ్చి ప్రథమ చికిత్స చేసిన వైద్యుడు వెంటనే శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. తన వద్ద ఆపరేషన్ చేసే సౌకర్యాలు లేవని చెప్పారు. బరంపురం వెళ్లిన ఆయన స్నేహితులు కేశవపట్నం ఉమాశంకర్(చిన్ని), జన్నెల జయకుమార్ ఆయనకు తోడుగా నిలిచారు. పలాసలోని వెటర్నరీ డాక్టర్ అనిల్ కుమార్ వద్ద శస్త్రచికిత్స చేసే సౌకర్యం ఉన్నట్టు తెలియడంతో అంజనీకుమార్ తన కారులో కుక్క పిల్లను అక్కడికి తీసుకువెళ్లారు. ఆయనతోపాటు సహాయంగా అప్పన్న గౌడో వెళ్లారు. డాక్టర్ అనిల్ కుమార్ శస్త్రచికిత్స చేసి బయటకు వచ్చిన కనుగుడ్డును తీసి కుట్లు వేశారు. దీంతో కుక్క పిల్లకు ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం కుక్కపిల్లను అంజనీకుమార్ తన ఇంట్లోనే ఉంచి మందులు వేస్తున్నారు. మరో మూడు రోజులపాటు మందులు వేస్తే కుక్కపిల్ల కోలుకుంటుందని వైద్యుడు చెప్పారని అంజనీకుమార్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు చాలా మంచి పని చేశారంటూ అంజనీకుమార్‌ను అభినందించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎంపీ కలిశెట్టి నిధులతో బోరు



**జి.సిగడాం, డిసెంబరు 27(వార్త):** పెంట గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బోరుబావి మంజూరు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సంద ర్భంగా బోరు స్థలం వద్ద పూజ నిర్వహించి బోరు వేయించారు. తాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించే లా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీ టీసీ సభ్యురాలు మక్క శ్రీలత, మక్క నారాయణరావు, రైల్వే జోనల్ సలహా సభ్యుడు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, బెవర జగన్నాథరావు, టీడీపీ సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, పైల బాబ్జీనాయుడు, నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, మీసాల రమణ, డొల పార్వతి, మక్క గిరి, మనోహర్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**జి.సిగడాం, డిసెంబరు 27(వార్త):** సంక్షేమం, వ్యవసాయం, పారిశ్రామిక రంగం అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కుమ రాపు రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, రైల్వే జోనల్ సలహా సభ్యులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వారు పెంట గ్రామంలో విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.57 వేల కోట్లను పేద ప్రజల సంక్షేమం కోసం పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా పింఛన్లు పంపిణీ చేసి సరిపుచ్చారన్నారు. సీఎం చంద్రబాబు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తూ ఆయా కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నారన్నారు. అమ్మఒడి వంటి పథకాలను అమలు చేస్తూ ఇంట్లో అందరికీ సంక్షేమ పథకాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు లేని పరిస్థితి నుంచి నేడు గూగుల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ట్రైనీ కానిస్టేబుళ్లకు నెలకు రూ.12000 స్టైఫండ్ అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మినిస్టర్ వంగలపూడికే చెందిందన్నారు. వీరితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, పైల బాబ్జీనాయుడు, గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయ్మ, డోల పార్వతి తదితరులు ఉన్నారు.

## పలాసను జిల్లాగా వెంటనే ప్రకటించాలి



**మందస, డిసెంబరు 27(వార్త):** పలాసను జిల్లాగా తక్షణమే ప్రకటించాలని జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇచ్ఛాపురం, మందస మండలాల సంఘ నాయకులతో కలిసి పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా)ను కలిశారు. పలాస జిల్లా ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పలాస జిల్లా ఏర్పాటు జరిగితే ఈ ప్రాంతంలో నివసిస్తున్న వికలాంగులకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరగా అందుతాయని, న్యాయం, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయన్నారు. పలాస జిల్లా సాధన ఉద్యమంలో ప్రతీ వర్గం, ప్రతీ సంఘం భాగస్వామ్యంతో కలిసి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

## సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి



**మందస, డిసెంబరు 27(వార్త):** సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. ఈ నెల 31నుంచి జనవరి 4వరకు విశాఖలో జరగనున్న ఈ మహాసభల ప్రచారం శనివారం హరిపురంలో నిర్వహించారు. 4న విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మహా ప్రదర్శన, మున్సిపల్ గ్రౌండులో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శన, సభల్లో యావత్ కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు. ఈ ప్రచారంలో సీఐటీయూ మందస మండల నాయకులు పి.దేవేంద్ర, ఆర్.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర్ బాల్ దివాస్ వేడుకలు



**పలాస, డిసెంబరు 27(వార్త):** వీర్ బాల్ దివాస్ వేడుకలు తపస్వి హైస్కూల్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్షుడు పొట్నూరు తారకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ మతోన్మాదులకు తలొగ్గకుండా, గురు వుల మాట తప్పకుండా, ధర్మాన్ని వీడకుండా, ముక్కుపచ్చలారని వయసులో, ధైర్యసాహసాలు కనబరిచి, ధర్మం కోసం ప్రాణ త్యాగం చేసిన వీర బాలురు బాబా జోరావర్ సింగ్, బాబా పతే సింగ్ అన్నారు. అనంతరం తమ్మినాన మాధవరావు సౌజన్యంతో విద్యార్థులకు బుక్స్, పెన్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పూర్వ కన్వీనర్ రామానంద స్వామిజీ, జిల్లా కార్యవర్గ సభ్యులు వైశ్యరాజు మోహన్ రాజు, టౌన్ ప్రధాన కార్యదర్శులు బొండా శ్రీనివాసరావు, హనుమంతు రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్తు రామారావు, ఎస్సీ మోర్చా నాయకులు గుంటు అప్పారావు, బూర్జపేట హరి కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు ప్రధాన మన్మథరావు, స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 12న పెద్ద కొజ్జిరియాలో క్విజ్ పోటీలు

**సోంపేట, డిసెంబరు 27(వార్త):** కంచిలి మండలం పెద్ద కొజ్జిరియాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి జట్టులో నలుగురు సభ్యులు ఉండాలని, వయ స్సుతో నిమిత్తం లేదని, ప్రవేశ రుసుము ఏమీ లేదని పేర్కొన్నారు. విజేతలకు సోంపేట సంస్కారభారతి విద్యాసంస్థల వారు బహుమతులను అందించను న్నట్లు తెలిపారు. మొదటి బహుమతి కింద రూ.10,116లు, షీల్డ్ అందించనున్నారు. రెండో బహుమతి కింద రూ.8,116లు, షీల్డ్, మూడో బహుమతి కింద రూ.6,116లు, షీల్డ్ అందించినట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు క్విజ్ పోటీలో పాల్గొని విజయాలు సొంతం చేసుకోవాలని కోరారు.

# మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**-పలాసకు చేరుకున్న**
**అభ్యుదయ సంకల్ప సైకిల్ యాత్ర**
**-డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో**
**హోరెత్తిన జంట పట్టణాలు**
**- పలు విద్యా సంస్థల విద్యార్థులు హాజరు**



**పలాస, డిసెంబరు 27(వార్త):** మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సంకల్పయాత్రను శనివారం ఇందిరాగాంధీ చౌక్ నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా శ్రీనివాస్ లాడ్జి, కాశీబుగ్గ బస్టాండ్‌కు చేరుకొని పలాస రైల్వే గ్రౌండ్‌లో ముగించుకొని, భారీ బహిరంగ సభ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు రహిత సమాజం నిర్మాణం అందరి బాధ్యత అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదం యువతలో అవగాహన పెంచడానికి గొప్ప ప్రచార కార్యక్రమమని కొని యాడారు. మత్తు పదార్థాల వాడకం జీవితాలు, కుటుంబాలను నాశనం చేస్తుందని, యువత భవిష్యత్తును పాడు చేసుకుంటారని, ఆరోగ్యం, మానసిక స్థితి దెబ్బతింటాయన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ని సైకిల్‌యాత్ర ద్వారా నిరూపిస్తున్న పోలీస్ శాఖకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. యువతలో సామాజిక స్పృహ రావాలని, డ్రగ్స్ కుటుంబాన్ని, సమాజాన్ని పాడు చేస్తున్నాయో ఈ కార్యక్రమాల ద్వారా ప్రతి వీధి వీధికి, మండలానికి, గ్రామానికి తెలియపరుస్తూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హోం శాఖకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండడమే కాదని, వాటిని తీసుకొస్తున్న వాళ్లందర్నీ కూడా శిక్షించే బాధ్యత మనందరి మీద ఉందని పిలుపునిచ్చారు. అనంతరం హాజరైన వారంతా పోలీస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షహబాజు అహ్మద్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ, కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి, ఏఎస్ఐలు, టీడీపీ ముఖ్య నాయకులు, పలు విద్యా సంస్థల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# గంగారత్నం నేత్రాలు సజీవం

**- మాతృమూర్తి మరణంతో నేత్రదానం**
**చేయించిన రచయిత కోదండం**

**మందస, డిసెంబరు 27(వార్త):** ప్రముఖ రచయిత మామిడి కోదండరావు మాతృమూర్తి గంగారత్నం ఊపిరితిత్తుల వ్యాధితో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందడంతో ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేసి, ఆమెను సజీవంగా నిలిపారు. ఆమె కుటుంబసభ్యులు నిర్మల, కమల, ప్రమీల తమ తల్లి నేత్రాలను దానం చేస్తామని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు తెలిపారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, నంది ఉమాశంకర్ బృందం ఆమె కార్నియా సేకరించి, విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.





గంగారత్నం మృతిబీళి పొడుగు చరణ్, పలాస ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, వైసీపీ నాయకులు గిన్ని తిరుపతి రెడ్డి, సేనాపతి కిశోర్‌కుమార్, మట్ట ఆనందరావు, అల్లాడ తాతయ్య, కళాసీ యూనియన్ నాయకులు వల్లభరావు, అల్లాడ కృష్ణ, పత్రి భూషయ్య సీపీఎం నాయకులు టొంప లక్ష్మీనారాయణ, పొందర దేవేంద్ర, మట్ట ధర్మ, బమ్మిడి ఆనందరావు, వంశధార సాధన కమిటీ నాయకుడు ధర్మార్పు వెంకటరావు, గోసాని సమితి మాజీ చైర్మన్ మామిడి సుధ, నాగేశ్వరావు తదితరులు సంతాపం తెలియజేసి, దాత కుటుంబ సభ్యు లను అభినందించారు. అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలని కోరారు. డొక్కరి పురుషోత్తం, ధర్మారావు, సబ్బి వీరాస్వామి, మట్ట కేశవదాసు, మడ్డు తాతారావు, మద్దిల కృష్ణారావు, పురుషోత్తం బెహరా, ప్రదీప్ షాహు, ప్రభాకర్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ ఆమె నేత్రాలు భౌతికంగా సజీవంగా ఉంటాయన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నివాళులర్పించారు. కాగా తల్లి మరణించి పుట్టెడు దు:ఖంలో ఉన్న కోదండరావు మందసలోని శ్రీరాజా శ్రీనివాసా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెంచీల మరమ్మతులకు తల్లి పేరున రూ.2వేలు విరాళం అందించి, దాతృత్వం చాటుకున్నారు.

# ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి



**మందస, డిసెంబరు 27(వార్త):** మహిళా సంఘాల్లో ప్రతి మహిళ ఓ వ్యాపారవేత్తగా తయారవ్వాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అందరూ కలసి పనిచేయాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాల యంలో ఏర్పాటు చేసిన సి.ఆర్.పి.స్ట్రాటజీపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజన్ 47లో భాగంగా అన్ని కుటుంబాలకు కూడా ఆరోగ్యవంతంగా, సంతోషంతో సంపదను సృష్టించే విజన్‌ను అర్థం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ సాధించుకొని మెరుగైన ఫలితాల కోసం సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో మన సంఘ సభ్యుల ఆలోచన విధానం మారాలి. అప్పులను సమానంగా పంచుకునే పద్ధతికి స్వస్తి చెప్పి మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం ఏ కార్యక్రమానికి ఎవరికీ ఎప్పుడు ఎంత డబ్బులు కావాలో, ఆ విధంగా రుణాలను పొందాలని సూచించారు. సంఘ సభ్యులందరూ తమ సొంత నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం శ్రీనిధి బ్యాంకు ద్వారా కేవలం 92 పైసలు వడ్డీకే సంఘానికి సుమారు 8 లక్షల రూపాయలు వరకు అతి తక్కువ వడ్డీకి ఎలాంటి ప్రాసెస్ చార్జీ లేకుండా అందిస్తున్న దానిని సద్వినియోగ ´పరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణ కుమారి, లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కోఆర్డినేటర్లు స్వామినాయుడు, దుర్గారావు, రమేష్, బాలకృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సీత సాగరం ఆక్రమణలపై కామేశ్ పోరాటం



**సోంపేట, డిసెంబరు 27(వార్త):** సోంపేటలోని శ్రీశయన వీధి శివారులోని సీత సాగరం చెరువును కొంతమంది కబ్జా చేయడంపై ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ నేత పొడుగు కామేష్ తన పోరాటం కొనసాగిస్తున్నారు. స్థానిక తహసీ ల్దార్, పంచాయతీ ఈవోకు దీనిపై వారం క్రితమే ఫిర్యాదులు చేశారు. ఈవో వెంటనే స్పందించి సిబ్బందితో చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. కానీ దానిని కొద్దిసేపటికే గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడం గమనార్హం. దీంతో కామేష్ పట్టు విడవకుండా శనివారం సోంపేటలో ఉన్న మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీని కలిసి ఫిర్యాదు అందజేశారు. కవిటిలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో కబ్జాకు పాల్ప డింది టీడీపీ నాయకుడేనని పేర్కొనడం కోసమెరుపు. దీనిపై అధికార పార్టీ నాయకులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.


## రామాయణంపై పరీక్షలు



**ఇచ్ఛాపురం, డిసెంబరు 27(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యా వికాస సేవా సమితి విద్యార్థులకు "రామాయణ కథాంశం ప్రశ్నోత్తర" పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచిన డి.వరుణ్, బి.రేవతి, పి.దివ్యకు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ప్రశంసాపత్రం, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శ్రీధర్, రవి, శాంతి, మీనా, స్నేహ, శిరీష, రాజ్యలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

## ఘనంగా స్పెల్‌బీ పోటీలు

**పోలాకి, డిసెంబరు 27(వార్త):** ఈదులవలసలోని ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం మండల స్థాయి స్పెల్‌బీ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంఈఓ-2 ఎస్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మండలం లోని పలు పాఠశాలల నుంచి ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలను ఎంఈఓతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించి, జిల్లా స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన కనబరచాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ పాఠ శాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గీతాంజలి మాట్లాడుతూ ఈ పోటీలు విద్యార్థుల భాషా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ముద్దాయిలకు ఉచిత న్యాయ సేవలందిస్తాం

**- జూనియర్ సివిల్ జడ్జి యస్.వాణి**



**నరసన్నపేట, డిసెంబరు 27(వార్త):** ముద్దాయిలకు ఉచితంగా న్యాయ సేవలందిస్తామని జూనియర్ సివిల్ జడ్జి యస్.వాణి తెలిపారు. శనివారం ఆమె నరసన్నపేట సబ్ జైలును పరిశీలించారు. జైల్లో ఉన్న ఎనిమిది మంది ముద్దాయిలను నేరుగా కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం అందడంలో ఉన్న ఆలస్యాలు, బెయిల్ ప్రక్రియపై వారి సందేహాలను వినిపించారు. ఉచితంగా న్యాయవాదులను నియమించేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.ముద్దాయిల ఆరోగ్య పరిస్థితి, జైలులో ఉన్న మౌలిక వసతులు, భోజన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. జైల్లో అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ముద్దాయిల హక్కుల పరిరక్షణకు న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

**-ఏఐవైఎఫ్ నేతల డిమాండ్**

**-శ్రీకాకుళంలో నిరసన**




**శ్రీకాకుళం, డిసెంబరు 27(వార్త):** నిరుద్యోగ యువతకు భృతి ఎప్పుడు అందజేస్తారో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎప్పుడు కల్పిస్తారో స్పష్టత ఇవ్వాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, జిల్లా కార్యదర్శి కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాదైనా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు నిరసన, భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని, జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ జనవరి ఒకటినైనా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగాలు లేక యువత రోడ్లపైకి వస్తూ మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలవు తున్నారని, ఈ పరిస్థితుల్లో జరుగుతున్న ఆత్మహత్యలు ప్రభుత్వ వైఫల్య హత్యలేనని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ముందుకు సాగాలంటే యువత కీలకమని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తుతో ఆటలాడుతూ వారి జీవితాలను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. యువతరం ఆగ్రహం వ్యక్తం చేస్తే ప్రభుత్వాలు కూలిపోక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వెంటనే మొద్దు నిద్ర వీడి నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.సాంబశివరాజు, నాయకులు బి.అమోస్, అన్నాజీ, వసంత్, జగదీశ్, సూర్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

## 112తో తక్షణ పోలీస్ సహాయంపై అవగాహన



**పోలాకి, డిసెంబరు 27(వార్త):** పోలాకిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం పోలీస్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శక్తి టీం ఇన్‌చార్జి గిరిధర్ పాల్గొని విద్యార్థులకు శక్తి యాప్ ఉపయోగాలు, అది పని చేసే విధానాన్ని విపులంగా వివరించారు. పోక్సో చట్టం ప్రాముఖ్యత, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ మార్గాలు, ట్రాఫిక్ నియమాల పాటింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 112 ద్వారా తక్షణమే పోలీస్ సహాయం పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పీసీ యశోద, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొని విద్యార్థులను జాగ్రత్తగా ఉండాలని, చట్టాలపై అవగాహన కలిగి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.

## ఘనంగా పొట్నూరు స్వామిబాబు జయంతి



**నరసన్నపేట, డిసెంబరు 27(వార్త):** నరసన్నపేటలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పొట్నూరు స్వామిబాబు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు స్వామిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బూరెల్లి శంకర్, డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జ్యోతి ఫెడ్రిక్, సుడ మాజీ చైర్మన్ చంద్రభూషణ్ గుప్తా తదితరులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్వామిబాబు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా సమాజంలో నిరుపేదలు, అణ గారిన వర్గాలకు ఆయన అందించిన సహాయం, ఆశ్రయం ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. స్వామిబాబు దేశభక్తి, సేవాభావం నేటి తరానికి మార్గదర్శకమని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయన త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో దేశభక్తిని పెంపొందించాలనే సందేశం వెల్లువెత్తింది.

## జ్ఞానభారతిలో రామాయణంపై పరీక్ష



**ఇచ్ఛాపురం, డిసెంబరు 27(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల సెక్రటరీ సీఈవో జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్య వికాస సేవా సమితి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రామాయణ కథాంశంపై ప్రశ్నోత్తర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా జోహార్‌ఖాన్ మాట్లాడుతూ భారత దేశ చరిత్ర సంస్కృతి, ఇతిహాసాలు గుర్చి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, భారతదేశ సంస్కృతిలో ఉన్న గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలన్నారు. పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఐబీ పండా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్, సమితి నిర్వాహ కులు ఆసి మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## తక్షణమే పలాస జిల్లా ప్రకటించాలి

**-కార్మికులు, వికలాంగుల డిమాండ్**



**పలాస, డిసెంబరు 27(వార్త):** పలాస జిల్లా కేంద్రంగా తక్షణమే ప్రకటించా లంటూ పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త, షిరిడీసాయి సంస్థ ట్రస్ట్ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలాస జిల్లా సాధనకు కార్మికులు, వికలాంగుల మద్దతును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పడితే ప్రభుత్వ సేవలు, మరింత దగ్గరగా అందుతాయని, న్యాయం సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతాయని వివరించారు. పలాస జిల్లా కేంద్రంగా తక్షణమే ప్రకటించాలని వివిధ కార్మిక సంఘాలు ప్రజల నుంచి నానాటికీ మద్దతు పెరుగుతుందని తెలిపారు. పలాస జిల్లా సాధన ఉద్యమంలో ప్రతి వర్గం ప్రతి సంఘం భాగస్వామ్యంతో కలసి ముందుకు సాగుదామని వికలాంగుల సంగం తరఫున శ్రీకాకుళం జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కర్ వారి సంఘ నాయకులతో కలిసి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



**సోంపేట, డిసెంబరు 27(వార్త):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పైనే దృష్టి సారించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి తెలిపారు. శనివారం ఆ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం.. విద్యార్థుల అప్రమత్తత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. చెడు అల వాట్లకు లోనుకాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పీఓ పాపారావు, ఈగల్ క్లబ్ కన్వీనర్ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

## హిందువులూ మేలుకోండి

**జి.సిగడాం, డిసెంబరు 27(వార్త):** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ హోమాన్ని నిరసిస్తూ పాలఖండ్యాం వీధుల్లో శనివారం రాత్రి గ్రామ యువత, పెద్దలు, చిన్నలు ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, యువత మాట్లాడుతూ పలు ఇతర దేశాల్లో హిందువులపై పైశాచికంగా ఉన్మాది చర్యలకు పాల్పడడం హేయమన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడిని పెట్రోల్ పోసి తగుల బెట్టడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాల న్నారు. ఇప్పటికైనా హిందువులంతా మేల్కొని ఐక్యంగా ఉంటూ ప్రజాస్వామ్య బద్ధంగానే ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారబోయిన రెయ్యమ్మ, గర్లంకి శ్రీనివాసరావు, దారబోయిన ధర్మ రాజు, దారబోయిన వెంకటప్పారావు, పలిశెట్టి సూర్యనారాయణ, జగన్నాథ రావు, ఇజ్జి గోవిందరావు, రాయపురెడ్డి సూర్య నారాయణ, సి.సత్యారావు, తవుడు తదితరులు పాల్గొన్నారు.



## కూలిన పోలాకి ఓపెన్ హెడ్ కాలువ అక్విడెక్ట్

**-రైతుల్లో ఆందోళన**



**నరసన్నపేట, డిసెంబరు 27(వార్త):** రావులవలస వద్ద పోలాకి ఓపెన్ హెడ్ కాలువపై నిర్మించిన అక్విడెక్ట్ శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా కూలి పోయింది. దీంతో కాలువ నీరు వృథాగా వెళ్లిపోతుండడంతో పరిసర గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే రబీ పంటలకు సరిపడా సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో.. అక్విడెక్ట్ కూలిపోవడం తమకు తీరని నష్టాన్ని కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008లో నిర్మించిన ఈ అక్విడెక్ట్ కేవలం 17 సంవత్సరాల్లోనే కూలిపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తూ, నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ సమాచారం అందుకున్న సంబంధిత శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మురళీమోహన్ మాట్లాడుతూ కూలిపోయిన అక్విడెక్ట్ ను త్వరలోనే తిరిగి నిర్మిస్తామని, రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేశారు.

## బాధితులకు సీఎం సహాయనిధి అండ



**పోలాకి, డిసెంబరు 27(వార్త):** అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మబగాంలోని తన స్వగృహంలో తలసముద్రం గ్రామానికి చెందిన ప్రగడ చంద్రుడుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.25,000ల చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా రమణ మూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప మానవత్వం కలిగిన నాయకుడని, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరి స్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతోమంది పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మాజీ సర్పంచులు ప్రగడ సూరిబాబు, భావన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు ఊరట కలుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

### రామాయణ విశిష్టతపై పరీక్షలకు ..

## 1100 మంది విద్యార్థులు హాజరు

**నరసన్నపేట, డిసెంబరు 27(వార్త):** విద్యా వికాస సేవా సమితి ఆధ్వర్యంలో నరసన్నపేట మండలంలోని ఏడు పాఠశాలల్లో రామాయణ విశిష్టత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన పరీక్షలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షల్లో సుమారు 1100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామాయణం యొక్క నైతిక విలువలు, జీవితానికి అందించే మార్గదర్శకత్వం, నేటి తరానికి దాని ఉపయోగాన్ని తెలియజేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో విద్యార్థులకు రామాయణానికి సంబంధించిన పుస్తకాలను విద్యా వికాస సేవా సమితి ఆధ్వర్యంలో అందజేసి, వాటిలోని అంశాలను అవగాహన చేసుకునేలా మార్గనిర్దేశం చేశారు. ఆ అవగాహన ఆధారంగా ఈ పరీక్షలను నిర్వహించారు. పరీక్షలు ముగిసిన అనంతరం పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక కరపత్రాలు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు త్వరలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా వికాస సేవా సమితి సభ్యులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. రామాయణం వంటి మహాగ్రంథం ద్వారా విలువల ఆధారిత విద్యను పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందని వారు అభిప్రాయపడ్డారు.




## సీపీఐ శత వసంత ఉత్సవాలను జయప్రదం చేయాలి




**నరసన్నపేట, డిసెంబరు 27(వార్త):** సీపీఐ శత వసంత వార్షికోత్సవాలను ఘనంగా, జయప్రదంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో శుక్రవారం సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకులు నెయ్యల నారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శత వసంత ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. సీపీఐ తన వందేళ్ల ప్రస్థానంలో ప్రజల పక్షాన నిలబడి నిరంతర పోరాటాలు సాగించిందని, ప్రజల హక్కుల కోసం ప్రజలతో మమేకమై ఉద్యమించిందని తెలిపారు. బడుగు, బలహీన, గిరిజన వర్గాలకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర సీపీఐదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నరసన్నపేట మండల కార్యదర్శి ఆర్.అరవింద్, పార్టీ నాయకులు నెయ్యల మధు, లవకుమార్, భాస్కరరావు, మన్మథ, కర్ణవీరుడు, వసంత్, రాము, లక్ష్మి, అచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 30న వాసుదేవుని ఉత్తరద్వార దర్శనం



**మందస, డిసెంబరు 27(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని ఉత్తర ద్వార దర్శనం ఈ నెల 30(మంగళవారం)న నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు చెప్పారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవాసుదేవునికి ప్రత్యేక పూజలతో పాటు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

## ముమ్మురంగా పారిశుధ్య పనులు

**జి.సిగడాం, డిసెంబరు 27(వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జి.రామకృష్ణారావు అన్నారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు సర్పంచ్ ధారబోయిన రెయ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్ పర్యవేక్షణలో శనివారం పాలఖండ్యాం అన్ని విధుల్లో పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీల్లోని మురుగును తొలగించి శుభ్రం చేశారు. తాగునీరు వాటర్ ట్యాంకు, బావులు, బోర్లుల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించారు. వీధులు, రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను శుభ్రం చేసి ట్రాక్టర్ సహా యంతో చెత్త నుంచి సంపద కేంద్రాలకు, దూర ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ధారబోయిన ధర్మరాజు పాల్గొన్నారు.



## ప్రజలకు చట్టాలపై అవగాహన

**పలాస, డిసెంబరు 27(వార్త):** ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి అన్నారు. రాజగోపాలపురంలో శనివారం రాత్రి ఆయన ప్రజలకు చట్టాలు, సైబర్ క్రైమ్ మోసాలు, నారీ శక్తి, మహిళా భద్రత, బాల్య వివాహాలు తదితర అంశాలను వివరించారు. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం బాలికల వయస్సు 18, బాలుర వయస్సు 21 ఏళ్లు ఉండాలని, దీనిని ఉల్లంఘిస్తే శిక్షిస్తామని హెచ్చరించారు. కేంద్రం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' 100 రోజుల అవగాహన కార్యక్రమం పాఠశాలలు, మత నాయకులు, పంచాయతీల్లో నిర్వహిస్తోందని చెప్పారు. సైబర్ నేరగాళ్లు డబ్బు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో డ్రగ్స్ కేసు లేదా కేసు నమోదైందని ఫోన్ చేసి, అరెస్ట్ కాకుండా డబ్బు పంపమని బెదిరిస్తారన్నారు. అనుమానాస్పద లింకులు, మెసేజులు క్లిక్ చేయకండని, సమాచారం ధృవీకరించుకోవాలని, పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ చేయకండని, ఖాతా లావాదేవీలు తరచూ చెక్ చేయవద్దని, త్వరగా డబ్బు పంపమని ఒత్తిడి చేస్తే నమ్మకండని హెచ్చరించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, రాజగోపాలపురం గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# టీవీ9 రజనీకాంత్ తండ్రికి నేతల ఘన నివాళులు











టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ తండ్రి సాంబశివరావు ఇటీవల పరమపదించిన సంగతి తెలిసిందే. ఆయన దశదిన కర్మ శుక్రవారం గుంటూరులో జరగగా, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, ఏపీ మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, ప్రముఖ సెఫాలజిస్ట్ ఆరామస్తాన్, ఇతర నాయకులు ఆ కార్యక్రమానికి హాజరై సాంబశివరావుకు మృతికి సంతాపం తెలిపి, ఘనంగా నివాళులర్పించారు.

–గుంటూరు

## అంబేడ్కర్ కాలనీలో పారిశుద్ధ్యం మెరుగు పరుస్తాం



**సారవకోట, డిసెంబరు 27(వార్త):** సారవకోట అంబేడ్కర్ కాలనీలో నెల కొన్న పారిశుధ్య సమస్యలపై జనసేన నేతలు గ్రామ కార్యదర్శి లక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి లక్ష్మి కాలనీలోని పరిసర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీలో పారిశుధ్య పనులను త్వరలోనే చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు జనసేన మండల నాయకుడు పృథ్వీ తెలిపారు. న్యూ కాలనీలో పాడైపోయిన బావిని పరిశీలించిన కార్యదర్శి, దాన్ని శుభ్రపరచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాలనీలో వీధి దీపాల కొరత సమస్యపై సచివాలయ సిబ్బంది స్పందిస్తూ, అవసరమైన చోట్ల వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయం చొరవ చూపుతుండ డంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## మెహర్ విద్యాలయంలో వీర బాలదివస్



**శ్రీకాకుళం, డిసెంబర్ 27(వార్త):** సిక్కు బిడ్డల త్యాగాలను ఎప్పటికీ మరచి పోలేమని బీజేపీ శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. బీజేపీ శ్రీకాకుళం వెస్ట్ మండలంలో మండల అధ్యక్షులు చింతాడ భూషణ్ రావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని మెహర్ విద్యాలయంలో శనివారం వీరబాల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ నాయకులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాల్‌రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మత పునాదులను కదిలించేటంతగా భయభ్రాంతులను చేయాలని చూసిన వారిని అడ్డుకోవడంలో సిక్కుల పదో గురువు గురు గోవింద్‌సింగ్ కుమారులు సాహిబ్‌జాదె బాబా జొరావర్‌సింగ్, బాబా ఫతేసింగ్‌ల శౌర్య పరాక్రమాలను భారతదేశం గుర్తించుకుంటుందని తెలిపారు. వీరు పిన్న వయసులోనే మొగలులను ఎదురించారన్నారు. ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన వీర బాలుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామేశ్వరరావు, వెస్ట్ మండల పూర్వ అధ్యక్షులు వేమూరి ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ నల్లన ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు అందజేత

**శ్రీకాకుళం, డిసెంబర్27(వార్త):** పోస్ట్ కోవిడ్ తర్వాత వచ్చే పరిణామాల్లో ఎక్కువగా శ్వాసకోశకు సంబంధించి సమస్యలు ఎదురవుతున్నా యని, ఆయా బాధితులను కాపాడటానికి పెద్దపేటకు చెందిన యాక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ సంస్థ ద్వారా డైరెక్టర్ నూక సన్యాసిరావు సుమారు 10 లక్షలు పైబడి విలువచేసే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు పెరుగుతున్నాయని, ఆయా బాధితులను కాపాడుకోవడానికి తక్షణం ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్ ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు పి.జగన్మోహన్ రావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అరసవల్లి రథసప్తమికి వైభవంగా ఏర్పాట్లు

*** జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు * వారం రోజుల పాటు ఉత్సవాలు * ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, డిసెంబర్27(వార్త):** అరసవల్లి క్షేత్రంలో జనవరిలో జరగనున్న రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రథసప్తమి ఏర్పాట్లపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది వేడుకలను ఏడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, పార్కింగ్ సౌకర్యాలను క్షేత్రానికి మరింత చేరువలోకి తీసుకొస్తామన్నారు. రికార్డు స్థాయిలో 200 పబ్లిక్ టాయిలెట్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా టెంట్లు, బెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అందరికీ స్వామివారి ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు, పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. నగరమంతా విద్యుత్ కాంతులతో వెలిగిపోవాలని, ప్రభుత్వ భవనాలతో పాటు ప్రజలు తమ ఇళ్లను కూడా అలంకరించుకోవాలని కోరారు. రథసప్తమి వేడుకల్లో ఏడు రోజుల పాటు హెలికాప్టర్ పర్యటనలు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే వెల్లడించారు. జిల్లా కళాకారులకే సాంస్కృతిక కార్యక్రమాల్లో తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. నగరంలోని వివిధ మైదానాల్లో క్రీడా పోటీలు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని, జిల్లా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ బంగ్లా నుంచి పీజీ పేట వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సన్నద్ధమవుతున్నామన్నారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ మాట్లాడుతూ.. జనవరి 25న రథసప్తమి సందర్భంగా వారం రోజుల కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 19,20న అలివేటి మండపంలో స్వామివారికి అభిషేకాలు, 21 స్వామి వారికి స్వర్ణాలంకరణ సేవ, 22న ఉత్సవమూర్తికి లక్ష పుష్పార్చన, 23న సామూహిక సూర్యనమస్కారాలు, 24న మహాసౌరభం, పూర్ణాలంకర; ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ, 25న వేకువజామునే సుప్రభాత సేవ, రథసప్తమి ప్రధాన వేడుకలు నిర్వహిస్తామన్నారు. రథసప్తమి ఏర్పాట్లపై జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రముఖులు సూచనలు చేశారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్ మోహన్ రావు మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం వీల్ చైర్లు, మజ్జిగ పంపిణీ చేపడతామని, వయోవృద్ధులను పార్కింగ్ స్థలం నుండి ఆలయం వరకు చేరవేసేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పిస్తే బాగుంటుందని ప్రతిపాదించారు. సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు అల్లాడ ప్రసాదరావు మాట్లాడుతూ.. సేవలో పాల్గొనే వాలంటీర్ల వివరాలతో కూడిన డేటాను సిద్ధం చేయాలని, వారికి నిర్దిష్ట బాధ్యతలు కేటాయించాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ వేడుకల సందర్భంగా వేద పఠనం నిర్వహించాలని, స్వామివారి వైభవాన్ని చాటేలా జిల్లా అంతటా 'సూర్య రథం' తిప్పాలని కోరారు. లైన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ సింధూర మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల ఏర్పాటు గురించి వివరించారు. జిల్లాలోని ఆలయాల చరిత్రను ప్రచారం చేయాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి ఎ.రమణమూర్తి సూచించారు. టికెట్ల జారీలో క్యూఆర్ కోడ్ విధానం ఉండాలని, సామాన్య భక్తులకు దర్శన సమయం పెంచాలని పలువురు కోరారు. కళాకారుల సంఘం తరఫున రామారావు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలలో జిల్లా కళాకారులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శోభారాణి, విశ్రాంత డి.ఆర్.ఓ ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ ప్రసాదరావు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ సింధూర, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎ.రమణమూర్తి, అల్లాడ ప్రసాదరావు, రామారావు, పెద్ద ఎత్తున ప్రజలు, ప్రతినిధులు తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

### అరసవల్లి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

అరసవల్లి పరిసర ప్రాంతా లను శుభ్రంగా ఉంచి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి అరసవల్లి అనుబంధ కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, భక్తుల రాకపోకలకు వీలుగా మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొయ్యన కన్నయ్య కాలనీ, తెలుగు ముసలయ్య కాలనీ, కామేశ్వర్ నగర్ తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన కాలువల పనులు, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. వెంటనే పూడికతీత పనులు చేపట్టి, రహదారులను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన అనుసంధాన రహదారుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం అరసవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మెరుగైన వసతులు కల్పించాలని, ఆసుపత్రి చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని సూచించారు. కామేశ్వర్ నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే సరిచేయాలని, ఉత్సవాల వేళ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారి శుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.

# కేంద్ర నిధులతో.. జిల్లా అభివృద్ధి చేస్తాం

*** సకాలంలో నిధులు వినియోగించండి * అధికారులు బాధ్యతగా పనిచేయాలి * లోటుపాట్లు ఉంటే సరిద్దాలి * కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు * ఆరోగ్యం, విద్య, తాగునీరు, రోడ్లపై సమీక్ష**




**శ్రీకాకుళం, డిసెంబర్ 27(వార్త):** జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సకాలంలో వినియోగించి ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర పథకాల అమలు పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశంలో శనివారం మంత్రి పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగంపై మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్–2025లో జిల్లాలో 2,27,142 మంది రైతులకు రూ.2,771.9 కోట్ల పంట రుణాలు మంజూరయ్యాయని, అలాగే పొలం బడి కార్యక్రమం కింద ఒక్కో యూనిట్‌కు 25 ఎకరాల చొప్పున రైతులకు శిక్షణలు నిర్వహిస్తూ ఇప్పటివరకు రూ.6.28 లక్షల వ్యయం జరిగిందన్నారు. తాగునీటి రంగంలో జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో 5,608 పనులు మంజూరయ్యాయని, వాటిలో 1,135 పనులు పూర్తయ్యాయని, మరో 2,024 పనులు ప్రస్తుతం ప్రగతిలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. అలాగే ఇప్పటివరకు 5,35,764 గృహాల్లో 2,30,381 గృహాలకు నల్లాల ద్వారా తాగునీరు అందించామని పేర్కొంటూ, మిగిలిన గృహాలకు కూడా వేగంగా కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్య రంగంపై మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం కింద ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షల వరకు చికిత్స సదుపాయం ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. క్షయ (టీబీ) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక భవనాల కేటాయింపుపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంపై మాట్లాడుతూ జిల్లాలో 41 పీఎంశ్రీ పాఠశాలలు మంజూరయ్యాయని, అలాగే 23 అటల్ టింకరింగ్ ల్యాబ్స్, 66 పాఠశాలల్లో పి ఎ ఎల్ ల్యాబ్స్ ద్వారా డిజిటల్ విద్యను విస్తరిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కింద 721 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి ఒక్కో పాఠశాలకు రూ.5,000 చొప్పున నిధులు విడుదల చేసినట్లు వివరించారు. రవాణా, రోడ్లపై మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ రహదారుల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని, అలాగే ట్రామా కేర్ సెంటర్ల నిర్వహణ మెరుగుపడితే ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి స్పష్టం చేశారు. ఎనీమియా రహిత జిల్లాగా శ్రీకాకుళంను తీర్చిదిద్దాలని కోరారు. పూర్తి అంగ వైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు ఫించను చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయంగా శ్రీకాకుళం గ్రానైట్ అమ్మకాలు తగ్గుముఖం పట్టడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. దేశీయంగా మంచి అమ్మకాలు సాగిస్తున్నా.. అంతర్జాతీయ స్థాయిలో ఎదురైన పరిస్థితులను అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జడ్పీ సీఈవోతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమాజ హితమే జాగృతి అభిమతం



**సోంపేట, డిసెంబరు 27(వార్త):** సమాజ హితమే జాగృతి అభిమతమని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి తెలి పారు. శనివారం ఆయన జాగృతి సంస్థ వార్షికోత్సవంలో మాట్లాడారు. ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండటంతో పాటు సేవాతత్పరత అలవాటు చేసుకుంటే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పదిహేడేళ్లుగా జాగృతి సంస్థ తన వంతు మేలు చేసే దృక్కోణంతో పనిచేస్తోందన్నారు. బాల్య వివాహాల నిషేధం, రక్త, అవయవదానంపై అవగాహన సదస్సులు నిర్వహించ డం, ప్లాస్టిక్ నిషేధం, కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యల సాధనకు ప్రయత్నిస్తున్నా మన్నారు. వేసవిలో తాగునీరు అందించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వస్తు, ఆర్థికసాయం, వైద్య శిబిరాల నిర్వహణ, బాలలకు ఇప్పటి వరకు ఐదు వేల భగవద్గీత పుస్తకాల వితరణ జరిపామన్నారు. జానపద కళాకారులకు ఉత్తమ ఉపాధ్యాయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు, పీహెచ్‌డీ పరిశోధకులకు, వేలాది మంది ప్రజ్ఞావంతులకు సన్మానాలు వంటివి చేపట్టామ న్నారు. ముఖ్యంగా యువతకు, విద్యార్థులకు సంచార మనో వికాస పాఠశాల ద్వారా వ్యక్తిత్వ తరగతులు ఉచితంగా నిర్వహించి ప్రేరణ కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపడుతుంటామని తెలిపారు.

### కుమార్ నాయక్‌కు సన్మానం

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్‌నాయక్‌ను స్వర్గీయ గండు తులసీనారాయణ స్మారక అవార్డు, జానపద కళారత్నతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సోంపేట మండల విద్యాశాఖాధికారి టి.కృష్ణారావు, ఎస్.జోరాడు, గొనకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, తామాడ వాసుదేవరావు, రత్నాల వెంకటరమణ, ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు పి.చందు ఎస్.ఢిల్లీరావు, గంగారావు, బాబూరావు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ

**శ్రీకాకుళం, డిసెంబర్ 27(వార్త):** కాశీబుగ్గ పోలీస్ సబ్ డివి జన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన షేక్ షాహాబాజ్ అహ్మద్ శనివారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, విజిబుల్ పోలిసింగ్, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546